సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 15 । మార్చి । 2024



లహరిలో.. లాహిరిలో...

ఆర్టీసీ ఇటీవల ప్రవేశపెట్టిన లహరి స్లీపర్ కోచ్ ఏసీ, నాన్ ఏసీ బస్సులకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. IIలో



పామాయిల్ సాగుతో ఆదాయం

పామాయిల్ సాగుతో అధిక లాభాలు వస్తాయని డీఏఓ బాబూరావు అన్నారు. ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో పర్యటించారు. IIలో

గరిష్టం / కనిష్టం
35° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం ప్రారంభమైన ఎండ గంటగంటకూ పెరుగుతూ ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సా॥) 6.24

సహర్ (శనివారం ఉ॥) 4.55

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి హుండీ ఆదాయం రూ.25.44 లక్షలు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా 85 రోజులకు గాను రూ.25,44,968 ఆదాయం నమోదైందని దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.భేల్‌సింగ్, ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. అలాగే, విదేశీ కరెన్సీ, మిశ్రమ వెండి, బంగారం లభించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగంతో పాటు డైరెక్టర్లు, కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ పుల్లారు మదన్‌మోహన్, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, పెద్దమ్మతల్లి అమ్మవారికి గురువారం అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో అర్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

స్థానిక భక్తులకు ఉచిత దర్శనం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ భక్తులకు ఈనెల 18 నుంచి శ్రీసీతారామచంద్రస్వామి వారి దర్శనాన్ని ఉచితంగా కల్పించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానంలో ఉత్సవాలు, ప్రముఖుల తాకిడి, విశేష రోజులు మినహా ప్రతీ మంగళ, బుధ, గురువారాల్లో స్థానికులకు రూ.100 ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఉచితంగా రామయ్య దర్శనభాగ్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆధార్, ఓటర్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఏదైనా గుర్తింపు కార్డును సిబ్బందికి చూపించి రామయ్యను దర్శించుకోవచ్చని, ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.

నేడు ఇంటర్వ్యూలు

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికను ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 119 పోస్టులు భర్తీ చేస్తామని, ఐడీఓసీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు అర్హులు హాజరు కావాలని సూచించారు.

ఇటు ఇసుక.. అటు మట్టి
మటాష్..!

ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే ఉద్దేశం తమకు లేదని, స్థానిక అవసరాల కోసమే కొంతమేర ఇసుకను గోదావరి నుంచి తీసుకెళ్తున్నామని సవినయంగా చెబుతూ తవ్వకాలు మొదలెట్టారు. రెండు, మూడు రోజులు గడిచిన తర్వాత భారీ యంత్రాలను గోదావరిలోకి దించారు. అభ్యంతరం చెప్పేవారు కనిపించకపోయే సరికి భారీ యంత్రాలు, టిప్పర్లు తిరిగేందుకు వీలుగా ఏకంగా నదిలోనే మట్టి రోడ్డు నిర్మాణం ప్రారంభించారు. దీని కోసం సమీపంలోని గుట్టలను కరిగించేస్తున్నారు. అయితే ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో ఒక్కసారిగా అంతా గప్‌చుప్ అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

సవినయంగా సఫా చేస్తున్న ఘనులు

- స్థానిక అవసరాల పేరుతో ఇసుక దందా
- భారీ యంత్రాలతో తోడుతున్న వైనం
- రాకపోకలకు రోడ్ల నిర్మాణం.. అందుకోసం మట్టి తవ్వకాలు





చర్ల లక్ష్మీకాలనీ దగ్గర మట్టి మాఫియా దెబ్బకు కరిగిపోతున్న గుట్ట (ఇన్‌సెట్) యంత్రాల రాకపోకల కోసం గోదావరిలో నిర్మించిన మట్టి రోడ్డు

చర్ల కేంద్రంగా..

గోదావరి తీరం వెంట మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, పినపాక, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త ర్యాంపులకు అనుమతి లభించింది. కానీ ఎన్నికల తర్వాత కొలువుదీరిన నూతన ప్రభుత్వం ఇసుక అక్రమాలపై నజర్ పెట్టింది. కొత్త విధానం అమల్లోకి వచ్చే వరకు టీఎస్ఎండీసీ ద్వారా ఇసుక అమ్మకాలపై ఆంక్షలు విధించింది. అయితే ఈ ఆంక్షలు చర్ల మండలంలో అమలుకు నోచుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఇక్కడ ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు తెర లేపారు. ముందుగా రాత్రి వేళలో భారీ యంత్రాలతో గోదావరి నుంచి ఇసుకను తోడి స్టాక్ పాయింట్‌కి చేర్చడం మొదలెట్టారు. ఇక్కడ జరుగుతున్న అక్రమాలపై మైనింగ్, టీఎస్ఎండీసీ, రెవెన్యూ, అటవీశాఖ.. ఇలా ఏ ప్రభుత్వ విభాగాలూ తమ వైపు చూడటం లేదనే నమ్మకం కుదరగానే పగటి పూట కూడా పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు, స్వచ్ఛంద సంస్థల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో గత నాలుగు రోజులుగా ఇసుక తవ్వకాలు ఆపేశారు. మళ్లీ అదును చూసి దందాకు తెరలేపేందుకు వేచి చూస్తున్నారు. ఇందుకు గోదావరి నదిలో కొత్తగా వెలిసిన మట్టి రోడ్లే ప్రత్యక్ష సాక్షిగా నిలుస్తున్నాయి.

కరిగిపోతున్న గుట్టలు

మట్టి మాఫియా దెబ్బకు చర్ల మండలంలోని గుట్టలు రూపురేఖలు కోల్పోతున్నాయి. గడిచిన మూడు నెలల వ్యవధిలోనే దేవానగరం, లక్ష్మీకాలనీ, జూనియర్ కాలేజీ, శ్మశానవాటిక దగ్గరున్న గుట్టలు కరిగిపోతున్నాయి. అక్రమ మైనింగ్ కారణంగా కళ్లెదుటే గుట్టలు కరిగిపోతున్నా, పట్టపగలే మట్టిలోడుతో టిప్పర్లు తిరుగుతున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఎవరైనా అభ్యంతరాలు చెప్పినప్పుడు తూతూమంత్రంగా క్షేత్రస్థాయికి వెళ్లడం , ఆ తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. ఫలితంగా ఏడాదిలోనే చర్ల చుట్టూ ఒక్కొక్కటిగా బొందలగడ్డలు వెలుస్తున్నాయి. కొండలు కనుమరుగైపోతున్నాయి.

నిబంధనల ఉల్లంఘన..

కాగితాలపై కనిపించే నిబంధనలు ఒకలా ఉంటే , క్షేత్రస్థాయిలో అవి అమలు జరిగే తీరు మరోలా ఉంటోంది. చర్ల ప్రాంతం ఏజెన్సీ పరిధిలోకి వస్తుంది. ఇక్కడ గిరిజనుల రక్షణ కోసం పెసా చట్టాన్ని అమలు చేయాల్సి ఉంది. దీని ప్రకారం స్థానిక గిరిజనులకు ఎక్కువ రోజులు ఉపాధి దొరికేందుకు వీలుగా మానవ శక్తితోనే ఇసుక తవ్వకాలు చేపట్టాలి. భారీ యంత్రాలను ఉపయోగించరాదు. కానీ ఈ నిబంధన ఏ కోశానా అమలు కావడం లేదు. భారీ యంత్రాలతో గోదావరిలో ఇసుకను ఎడాపెడా తోడేస్తున్నారు. ఇలా తోడిన ఇసుకను త్వరగా స్టాక్ పాయింట్‌కు చేర్చేందుకు గోదావరి నదిలో కొత్తగా మట్టి రోడ్ల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు గ్యాప్ ఇచ్చినా, సమయం చూసుకుని మళ్లీ మొదలుపెట్టేందుకు వీలుగానే పకడ్బందీగా రోడ్లు నిర్మిస్తున్నారు. ఈ మట్టిరోడ్ల నిర్మాణం కోసం చర్ల చుట్టు పక్కల రెవెన్యూ, అటవీశాఖ ఆధీనంలో ఉన్న బంజరు భూముల్లో భారీ యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నారు.

ఆనవాళ్లు ఉన్నాయి

చర్ల తహసీల్దార్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టాను. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. మట్టి తవ్వకాలు పరిశీలించేందుకు కలివేరు గ్రామానికి గురువారం వెళ్లగా అక్కడ ఎవరూ లేరు. కానీ మైనింగ్ చేసినట్టుగా ఆనవాళ్లు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం మైనింగ్ ఏడీతో కలిసి పెద్దిపల్లి ర్యాంపు దగ్గర పంచనామా చేశాం. వీటికి సబంధించిన రిపోర్టులు పై అధికారులకు పంపాం.

– శ్రీనివాస్, చర్ల తహసీల్దార్

రామాలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల, పక్కన ఐటీడీఏ పీఓ, అదనపు కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం) : భద్రాచలం రామాలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో గురువారం ఆమె అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భూసేకరణకు భద్రాచలం తహశీల్దార్, పంచాయతీ ఈవో, రామాలయ ఈఓ, సర్వేయర్‌తో సంయుక్తం కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూ సేకరణకు సంబంధించిన నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని వారికి సూచించారు. ఆలయ భూములకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల వివరాలు అందజేయాలని ఈఓ రమాదేవి, ఆర్డీఓ దామోదర్‌ను ఆదేశించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి..

మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. గురువారం నిర్వహించిన ఆర్ఓఎఫ్ఆర్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పూసుకుంట, ఆళ్లపల్లి, కరకగూడెం వంటి మారుమూలన ఉన్న గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా సమావేశాల్లో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, ఏడీ కుసుమకుమారి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమాదేవి, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్, యాసిన్ పాషా, కరకగూడెం జెడ్పీటీసీ కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాలకు అనుకూలంగా కాంప్లెక్స్‌లు నిర్మించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సూపర్‌బజార్(కొత్తగూడెం): సకల సదుపాయాలతో వ్యాపారాలకు అనుకూలంగా మార్కెట్ యార్డులో నూతన కాంప్లెక్స్‌లు నిర్మించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులకు సూచించారు. కొత్తగూడెం మార్కెట్ ఆవరణలో రూ. 1.84 కోట్లతో నిర్మించనున్న 21 షాపులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాత్కాలిక షెడ్లలో వ్యాపారాలు చేసుకుంటూ ఇబ్బంది పడుతుండడంతో నూతన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. వీటిని త్వరగా పూర్తిచేసి వ్యాపారులకు అప్పగించాలని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఎంపీటీసీ నూనావత్ గోవిందు, నాయకులు వాసిరెడ్డి మురళి, జి వీరస్వామి, జి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు విద్యుత్ సమస్యలు ఉండొద్దు

భద్రాచలం: భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లోని గిరిజన రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, విద్యుత్ ఏడీ, డీఈ, ఏఈ లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసిన రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా తప్పనిసరి అని చెప్పారు. ఇందుకు అటవీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇబ్బందులు ఉంటే రైతుల ద్వారా ఫారం –ఏ, బీలను సేకరించి తనకు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఆర్ఓఎఫ్ఆర్ డీటీ శ్రీనివాస్, ఏపీఓ మునీర్ పాషా పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమానికే ప్రాధాన్యం

బీటీపీఎస్ సీఈ బిచ్చన్న



డైరీలు ఆవిష్కరిస్తున్న బిచ్చన్న తదితరులు

మణుగూరురూరల్ : కార్మిక సంక్షేమానికే బీటీపీఎస్ తొలి ప్రాధాన్యత ఇస్తుందని సంస్థ సీఈ బి.బిచ్చన్న తెలిపారు. టీఎస్‌పీఈయూ–1535 ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లు, డైరీలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీటీపీఎస్‌ను లాభాల బాట పట్టించేందుకు ఉద్యోగులు చేస్తున్న కృషి అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ సంస్థను అగ్రభాగాన నిలపాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ రీజినల్ అధ్యక్షుడు వి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్. రామచందర్, నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, సిద్దులు హుస్సేన్, రాజమనోహర్, ఎస్‌డి రఫీ, తుంపూరి అనిల్, రత్నాకర్, శ్రీనివాస్, రవికుమార్, నరసింహారావు, రవిచంద్ర, సునీత, రమాదేవి, బేగం, రమణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డులు



ఉత్తమ అవార్డు అందుకున్న విజేత తదితరులు

కొత్తగూడెంటౌన్: జిల్లా సంక్షేమ శాఖాధికారి వేల్పుల విజేతతో పాటు మరో ముగ్గురు రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ, డైరెక్టర్ క్రాంతి వెస్లీ చేతుల మీదుగా విజేతతో పాటు అశ్వారావుపేట సీడీపీఓ చంద్రకాని రోజారాణి, కొత్తగూడెం సూపర్‌వైజర్ కాగితపు రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ ప్రమీల అవార్డులు అందుకున్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంచాలి

విద్యాశాఖ అకడమిక్ కోఆర్డినేటర్ నాగ రాజశేఖర్




విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట : విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, అందుకోసం ప్రభుత్వం వారికి అవసరమైన పుస్తకాలు అందిస్తోందని విద్యాశాఖ జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ అమృతలూరి నాగరాజశేఖర్, జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు అన్నారు. అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం, కొత్త నారంవారిగూడెం, అశ్వారావుపేట, దమ్మపేట మండలం మందలపల్లి ప్రభుత్వ పాఠశాలలను గురువారం వారు సందర్శించారు. వార్షిక పరీక్షలంటే భయం వీడాలని, లక్ష్య సాధన కోసం ప్రయత్నించాలని అన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, నోడల్ అధికారులు పాఠశాలలను నిరంతరం సందర్శించి బోధన సామర్థ్యాలను పరిశీలించాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ అమలు తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. మౌలిక భాష, గణిత సామర్థ్యాల ఉత్తమ బోధనకు ఉపాధ్యాయులు నిరంతరం శ్రమించాలన్నారు. అనంతరం అశ్వారావుపేటలోని భవిత కేంద్రాన్ని సందర్శించి ఐఈఆర్‌పీలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం హరిత, సీఆర్పీలు ప్రభాకరాచార్యులు, మల్లేష్, సోమరాజు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మడవి రమేష్, సీసీ మహబూబ్ పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్ పెట్టేలా..

- జిల్లాలో 12 ఆర్‌బీఎస్‌కే బృందాల ఏర్పాటు
- తొలివిడతలో 8 – 10 తరగతుల విద్యార్థులకు పరీక్ష
- ఇప్పటివరకు 24, 674 మందికి టెస్టులు..
- 784 మంది పిల్లల్లో సమస్య ఉన్నట్లు గుర్తింపు



కొత్తగూడెంరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో రక్తహీనత సమస్యకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మొదట 8 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులను పరీక్షిస్తారు. వారిలో రక్త శాతం ఎంత ఉందో తెలుసుకుని, మోతాదు కంటే తక్కువ ఉన్న వారికి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తారు. ఇందుకోసం జిల్లాలో 12 ఆర్‌బీఎస్‌కే టీమ్‌లను ఏర్పాటుచేశారు. ప్రతీ టీమ్‌లో ఒక మహిళా డాక్టర్, ఒక పురుష వైద్యుడితో పాటు ఏఎన్ఎం, ఫార్మసిస్ట్ ఉంటారు. ఒక్కో టీమ్ గత జనవరి నుంచి రోజుకు 100 మంది చొప్పున విద్యార్థులను పరీక్షిస్తున్నాయి. జిల్లాలోని 216 ప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు 32 వేల మంది ఉండగా, ఇప్పటివరకు 24,674 మంది పిల్లలకు డిజిటల్ హిమోగ్లోబిన్ మీటర్ ద్వారా పరీక్ష చేశారు. అందులో 784 మంది విద్యార్థులకు రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. వారికి జిల్లాలోని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు.

ఎదుగుదలపై ప్రభావం..

రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో 18 ఏళ్లలోపు వయసు గల బాలబాలికల్లో రక్తహీనత, అవయవ లోపాలు, పోషకాహారం, విటమిన్ల లోపాలు వంటి సమస్యలను గుర్తించేలా ప్రణాళిక రూపొందించారు. తద్వారా చిన్నారుల్లో ఎదుగుదల సమస్య నివారణకు కృషి చేస్తున్నారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉంటే పోషకాహారంతో పాటు సంబంధిత మందులు అందిస్తారు. యుక్త వయసు పిల్లల్లో రక్తం తక్కువగా ఉంటే శరీరంలో అలసట, చెమటలు ఎక్కువగా రావడం, గుండె దడ, చదువుపై ఏకాగ్రత లేకపోవడం తదితర సమస్యలు ఏర్పడతాయి.

'పరీక్షలు' సాధ్యమయ్యేనా..?

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 8 నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల్లో రక్తహీనత సమస్యపై పరీక్షలు చేస్తున్నారు. అయితే ఈనెల 18 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు ఉండడంతో ఇప్పటికే విద్యార్థులకు ప్రిపరేషన్ సెలవులు ఇచ్చారు. దీంతో పిల్లలు పాఠశాలలకు రావడం లేదు. పరీక్షలు పూర్తయిన తర్వాత కూడా వారు ఇక పాఠశాలలకు రానందున ఆయా విద్యార్థుల్లో లోపాలను గుర్తించడం కష్టమే. అలాంటి వారిలో రక్తహీనత సమస్య ఉన్నవారి పరిస్థితి ఇక అంతే సంగతులు. భవిష్యత్‌లో వారు ఇబ్బందులకు గురికాక తప్పదని తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక 8, 9 తరగతుల విద్యార్థులకు సైతం ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ఉన్నాయి.

లక్ష్యసాధన కష్టమే !

జిల్లాలో 12 ఆర్‌బీఎస్‌కే బృందాలు ఉన్నాయి. ఒక్కో టీమ్ రోజుకు 100 మంది విద్యార్థులను పరీక్షించాల్సి ఉండగా ఆ మేరకు చేయడం లేదు. దీంతో లక్ష్య సాధన కష్టమేననే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విద్యార్థినుల్లో రక్తహీనత సమస్య ఉంటే భవిష్యత్‌లో మరిన్ని ఇబ్బందులు తప్పవు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యధిక మంది నిరక్షరాస్యులు అయినందున వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి కాగానే ఆడ పిల్లలకు వివాహాలు చేస్తున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకే వారు గర్భం దాల్చితే రక్తహీనత ఉన్న అమ్మాయిలతో పాటు పుట్టే బిడ్డలకు కూడా ఇబ్బందులు తప్పవనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

రక్త హీనతతో ఇన్‌ఫెక్షన్..



విద్యార్థుల్లో రక్త హీనత సమస్య ఉంటే ఇన్‌ఫెక్షన్ వచ్చి, అనారోగ్యం బారిన పడతారు. ప్రధానంగా అమ్మాయిల్లో ఈ సమస్య ఉంటే వివాహం జరిగాక ప్రసవ సమయంలో ఇబ్బందులు తప్పవు. అంతేకాక తక్కువ బరువున్న పిల్లలు పుడుతారు. అందుకే ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవాలి. సమస్య ఉన్నవారు ఆకుకూరలు ఎక్కువగా తినాలి. జిల్లాలో 12 ఆర్‌బీఎస్‌కే బృందాల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు 784 మంది విద్యార్థుల్లో సమస్య ఉందని గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం.

– శిరీష, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ముందుగానే లక్ష్య సాధన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 129.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తిని 18 రోజుల ముందుగానే (ఈనెల 13న) చేరుకుంది. ఏరియాలో 129.74 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదు కాగా జీఎం శాలేంరాజు గురువారం వివరాలు వెల్లడించారు. సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం ఏరియా ఉత్పత్తిలో అగ్రస్థానంలో నిలిచిందని చెప్పారు. ఒకటి, రెండుసార్లు మినహా ప్రతీ నెలలోనూ కొత్తగూడెం ఏరియా ఉత్పత్తి లక్ష్యాలను సాధించిందని వివరించారు. ఇందుకు సహకరించిన అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు.

మైనింగ్ ఏడీ బదిలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా మైనింగ్ ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న కె.జైసింగ్ జగిత్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు వెలువడగా ఆయన స్థానంలో మాత్రం ఎవరినీ నియమించలేదు. ఇక అసిస్టెంట్ జియాలజిస్ట్‌గా మెదక్‌లో పనిచేస్తున్న జి.దినేష్‌కుమార్ నియమించగా, ఇక్కడ ఉన్న జి.నిరంజన్‌ను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే, రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌గా శాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్.పరశురాములును జిల్లాకు కేటాయించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



సామగ్రితో వెళ్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: గత నెల 28న ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం ముగిశాయి. చివరిరోజు పరీక్షకు 8,456 మంది విద్యార్థులకు గాను 8,168 మంది హాజరయ్యారని, 288 మంది గైర్హాజరయ్యారని నోడల్ అధికారి సులోచనారాణి తెలిపారు. పరీక్షలు ముగియడంతో హాస్టళ్ల విద్యార్థులు సామగ్రితో సహా సొంత ఊర్లకు బయలుదేరారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్లు రద్దీగా మారాయి.

క్లుప్తంగా

రాయితీపై ఫ్రూట్ కవర్స్

అన్నపురెడ్డిపల్లి: ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం రాయితీపై ఫ్రూట్ కవర్స్ రైతులకు అందిస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారి సందీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 11,500 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం తోటలు పూత, పిందె దశలో ఉన్నాయని, పిందె సైజ్‌లో ఉన్న కాయలను చీడపీడల నుంచి, పురుగు మందుల అవశేషాల నుంచి ఫ్రూట్ కవర్స్ ద్వారా కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కూసుమంచి: మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.రజిని కోరారు. పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా స్థానంలో 'ఆక్వా కల్చర్ ఉత్పత్తి – వ్యవస్థల్లో అధునాతన సాంకేతికత' అంశంపై ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి జిల్లాల మత్స్యకారులకు ఏర్పాటుచేసిన శిక్షణ గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా రజిని మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తిని రెట్టింపు చేసి ప్రజలందరికీ చౌకగా పౌష్టికాహారం అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకోసం మత్స్యకారులు శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ఆధునిక విధానాలు అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ బి.లవకుమార్, శాస్త్రవేత్త రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుతో ఆదాయం మెరుగు

జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు



చింతోనిచెలకలో కీరదోసకాయలను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: పామాయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ) వేల్పుల బాబూరావు పేర్కొన్నారు. గురువారం ఆయన చింతోనిచెలక గ్రామానికి చెందిన రైతులు కంభంపాటి నరేష్, నవీన్‌లు సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న కీర దోస, టమాటా, బీరకాయ, పామాయిల్ పంటలను పరిశీలించారు. తొమ్మిదోమైలుతండా, కుంటల్ల, బోడు, సంపత్‌నగర్ గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఎకరా విస్తీర్ణంలో పామాయిల్ సాగుచేస్తే ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం కల్పిస్తామన్నారు. కొత్త పోడు పట్టాలు వచ్చిన రైతులు పీఎం కిసాన్ నగదు కోసం ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఏడీఏ పి.వాసవీరాణి, ఇల్లెందు, టేకులపల్లి ఏఓలు సతీష్, నీరుడు అన్నపూర్ణ, ఏఈఓలు వై.శ్రావణి, విశాల, రమేష్, రెహానా, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ చేయించుకోవాలి

ఇల్లెందురూరల్: పీఎం కిసాన్ సహాయం పొందేందుకు అర్హులైన రైతులందరూ విధిగా ఈ–కెవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వినియోగదారుల సేవ కేంద్రాలను ఆయన సందర్శించి ఈ–కెవైసీ నమోదు వివరాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఇంకా 400మంది వరకు రైతులు ఈ–కెవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. అంతకుముందు మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ఏడీఏ వాసవీరాణి, ఏఓ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం లారీ సీజ్

అశ్వారావుపేటరూరల్ : అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. ఖమ్మం నుంచి ఏపీలోని రాజమండ్రికి ఈ నెల 12వ తేదీన లారీలో సుమారు 240 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా, సివిల్ సప్లై అధికారులు అశ్వారావుపేట ఆర్‌టీఏ చెక్‌పోస్టు (సరిహద్దు) అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో ఓ లారీలో రేషన్ బియ్యం ఉన్నట్లు అనుమానంతో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన లారీ నుంచి నుంచి గురువారం సివిల్ సప్లై డీటీ వెంకటేష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేసి పీడీఎఫ్ బియ్యంగా నిర్ధారించారు. లారీని సీజ్ చేసి రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై డీటీ వెంకటేష్ 'సాక్షి'కి తెలిపారు.

రూ.8లక్షల రివార్డు ఉన్న మావోయిస్టు అరెస్టు

చర్ల: ఛత్తీస్‌గఢ్ పోలీసులు రూ.8 లక్షల రివార్డు కలిగిన మావోయిస్టును గురువారం అరెస్టు చేశారు. బీజాపూర్ జిల్లాలోని బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బలగాలు గురువారం కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని పట్టుకుని విచారించగా మావోయిస్టు పార్టీ మద్దేడు ఏరియా కమిటీ కమాండర్ సుధాకర్‌గా తేలడంతో అరెస్ట్ చేశారు. ఆయనపై రూ.8 లక్షల రివార్డుతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో 108 అరెస్టు వారెంట్లు ఉన్నాయని, పలు జిల్లాల్లో జరిగిన విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు.

లహరిలో.. లాహిరిలో...



రోడ్డెక్కిన ఆర్టీసీ స్లీపర్ బస్సులు

- రీజియన్‌కు పది సర్వీసుల కేటాయింపు
- ఖమ్మం నుంచి బెంగళూరుకు నాలుగు ఏసీ బస్సులు
- ఆదరణ లభిస్తోందంటున్న అధికారులు

సాక్షి, ఖమ్మం డెస్క్:

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి హైదరాబాద్, బెంగళూరుతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్‌లోని వివిధ ప్రాంతాలకు ప్రజలు, ఉద్యోగుల రాకపోకలకు ఎక్కువగా ఉంటాయి. చాలామంది రాత్రి వేళ బయలుదేరి ఉదయం కల్లా గమ్యస్థానానికి చేరుకుని పనులు చూసుకునేలా ప్రయాణ ప్రణాళిక రూపొందించుకుంటారు. అయితే, వీరిలో చాలా మంది స్లీపర్ కోచ్ బస్సులను ఎంచుకుంటుండగా.. ఆర్టీసీలో లభ్యత లేక ప్రైవేట్ ట్రావెల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఖమ్మం మీదుగా రాత్రి వేళ రహదారులను పరిశీలిస్తే రయ్‌రయ్ మంటూ వచ్చివెళ్లే పెద్దసంఖ్యలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు కనిపిస్తాయి. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉండగా.. ఆర్టీసీ సైతం 'లహరి' పేరిట స్లీపర్ బస్సులను ఇటీవల ప్రవేశపెట్టింది.

ఖమ్మం రీజియన్‌కు పది బస్సులు

ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోలు ఉండగా.. ప్రస్తుతం ఖమ్మం, సత్తుపల్లి, మణుగూరు భద్రాచలం డిపోలకు కలిపి పది లహరి బస్సులు కేటాయించారు. దశల వారీగా కొత్తగూడెం, మధిర ఆపై ఇల్లెందు డిపోకు కూడా బస్సులు ఇచ్చే అవకాశముందని సమాచారం. ఇప్పుడు ఉన్న పది బస్సుల్లో ఖమ్మం డిపోకు నాలుగు ఏసీ బస్సులను కేటాయించగా.. భద్రాచలం, మణుగూరు, సత్తుపల్లి డిపోలకు రెండేసి చొప్పున నాన్ ఏసీ బస్సులు ఇచ్చారు.



అత్యాధునిక కుషన్‌తో రూపొందించిన బెర్త్‌లు

ప్రత్యేకతలు ఇవే..

లహరి బస్సులను ప్రయాణికుల అవసరాలకు తగ్గట్లుగా అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో ప్రతీ సీట్ / బెర్త్‌కు రీడింగ్ ల్యాంప్, చార్జింగ్ సాకెట్లు ఏర్పాటుచేశారు. అంతేకాక బెర్త్‌ల వద్ద యూఎస్‌బీ సాకెట్లు కూడా బిగించారు. ఇవేకాక వెహికల్ ట్రాకింగ్ సిస్టం, ఫైర్ డిటెక్షన్ అండ్ అలారం సిస్టమ్, సీసీ కెమెరా, స్పీకర్ అనౌన్స్‌మెంట్ సౌకర్యం కూడా ఉంది.

హైబ్రిడ్ రూపంలో ..

ప్రైవేట్ పోటీ నుంచి తట్టుకోవడంతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ ఇటీవల లహరి స్లీపర్ కోచ్ బస్సులను ప్రవేశపెట్టింది. ఈ బస్సులను హైబ్రిడ్ రూపంలో తీసుకొచ్చారు. అంటే ఇందులో బెర్త్‌లతో పాటు సీట్లు కూడా ఉంటాయి. వీటికి వేర్వేరు చార్జీలు నిర్ణయించగా.. ఇష్టమైనది ఎంచుకునే అవకాశముంది. అంతే కాక కొన్ని ఏసీ, మరికొన్ని నాన్ ఏసీ బస్సులు కావడంతో చార్జీల్లోనూ వ్యత్యాసం ఉంటోంది.



బస్సులో సీటింగ్

ఎక్కడెక్కడకు...

ఖమ్మానికి కేటాయించిన ఏసీ లహరి బస్సులను బెంగళూరుకు నడిపిస్తున్నారు. ఇక భద్రాచలం, మణుగూరు, సత్తుపల్లి డిపోల నుంచి ఆరు నాన్ ఏసీ బస్సులను హైదరాబాద్‌కు నడిపిస్తున్నారు. అన్ని బస్సులకు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ సదుపాయం కల్పించారు. త్వరలో రీజియన్‌కు మరిన్ని బస్సులు రానుండగా.. విశాఖపట్నం తదితర ప్రాంతాలకు కూడా నడిపించే అవకాశముందని తెలుస్తోంది.

బస్సులకు మంచి ఆదరణ



లహరి బస్సుల్లో ప్రయాణం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. అత్యాధునికంగా బస్సును రూపొందించారు. దీంతో ప్రయాణికుల నుంచి బస్సులకు మంచి ఆదరణ లభిస్తోంది. రాత్రివేళ నడిపించే సర్వీసుల్లో బెర్త్‌లకు బాగా డిమాండ్ ఉంది. సత్తుపల్లి డిపో నుంచి నడిచే బస్సుల్లో 70 శాతానికి పైగా ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) నమోదవుతోంది.

– యు.రాజ్యలక్ష్మి, డిపో మేనేజర్, సత్తుపల్లి

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు చెందిన భక్తులు గురువారం విరాళం అందజేశారు. ఖమ్మంకు చెందిన కల్వకుంట్ల గోపాలరావు దంపతులు రూ.లక్ష, కొత్తగూడెం విద్యానగర్‌కు చెందిన వనం సుధాకర్–మల్లిక కామాక్షి దంపతులు రూ.లక్ష చెక్కును ఆలయ అధికారులకు అందజేశాక, స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే, దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపిక అందజేశారు.

25న స్వర్ణలక్ష్మి పూజ

శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలోని శ్రీలక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో ఈనెల 25న శ్రీస్వర్ణలక్ష్మీ పూజ నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.600 చెల్లించాలని, వారికి పూజా సామగ్రితో పాటు అమ్మవారి వెండి ప్రతిమ, ప్రసాదం ఇస్తామని పేర్కొన్నారు. కాగా, 25న హోలీ రోజు రామయ్యను పెండ్లి కుమారుడిని చేసే కార్యక్రమం ఉండడంతో నిత్యకల్యాణాన్ని రద్దు చేసినట్లు ఈఓ తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జరిగింది. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని ఊట్లపల్లి గ్రామానికి చెందిన కుంజా నాగరాజు(26) నాలుగేళ్ల క్రితం ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివాహమైన ఏడాదిలోపే దంపతులు విడిపోయి వేరుగా ఉంటున్నారు. అప్పటి నుంచి నాగరాజు మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలోనే స్థానిక వెంకమ్మ చెరువు వద్ద తల్లి ఈశ్వరమ్మ మేకలు కాస్తుండగా, మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లాడు. తల్లి మేకలు కాస్తున్న సమయంలోనే ఇంటి వద్ద నుంచి తీసుకెళ్లిన పురుగుల మందు తాగాడు. గమనించిన తల్లి గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగరాజు మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాలికుంటు కట్టడికి కార్యాచరణ

- నివారణకు టీకాలే మార్గం
- నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు
- ఉమ్మడి జిల్లాలో 7లక్షల మేర పశువులు

ఖమ్మంవ్యవసాయం: పశువులను తరచూ ఇబ్బందులకు గురిచేసే వ్యాధుల్లో ప్రధానమైనది గాలికుంటు వ్యాధి. పశువులను ఈ వ్యాధి నుంచి రక్షించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయించనుంది. ఈనెల 15 నుంచి నెలరోజుల టు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యాన పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు కార్యాచరణ సిద్ధంచేశారు. ఉమ్మడి జిల్లాలో గేదెలు) సుమారు 4.10లక్షల వరకు ఉండగా, తెల్ల పశువులు 2.90 లక్షలు ఉన్నట్లు అంచనా.

గాలి ద్వారా వ్యాప్తి

అతి సూక్ష్మాతి సూక్ష్మమైన క్రిముల వల్ల పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుంది. పశువుల నోరు, గెట్టలు మధ్య పుండ్లు ఏర్పడి గాలి ద్వారా వ్యాపిస్తుంది. అందుకే దీన్ని గాలికుంటు వ్యాధి అంటారు. వ్యాధి సోకిన ఆవులు, గేదెల నుండి పాల ద్వారా దూడలకు సైతం వ్యాపిస్తుంది. కాగా, దేశవాళి పశువులతో పోలిస్తే వ్యాధి తీవ్రత సంకరజాతి పశువుల్లో అధికంగా ఉంటుంది. కాగా, వ్యాధి సోకిన పశువుల్లో జ్వరం తీవ్రత 105 డిగ్రీలకు పైగా ఉంటుంది. నోరు, నాలిక పైభాగంలో పుండ్లు ఏర్పడుతాయి. అంతేకాక పశువులు మేత మేయకపోగా, నెమర వేసేందుకు ఇబ్బంది పడుతాయి. రోజు కంటే పాల దిగుబడి తగ్గి, నిరంతరం కళ్ల నుంచి నీరు కారుతుంది. అలాగే, నోటినుంచి నురుగుతో పాటు సొంగ వస్తుంది. చికిత్సపై నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.



గాలికుంటు వ్యాధి సోకిన పశువుకు చికిత్స చేస్తున్న వైద్యులు


చికిత్సా విధానం ఇలా..

వ్యాధికి గురైన పశువులకు సరైన సమయంలో చికిత్స చేయిస్తే రక్షించుకోవచ్చు. తొలుత వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. పశువుల పాకలను క్రిమిసంహారక మందులు, బట్టలసోడాలతో శుభ్రం చేయాలి. ఒకవేళ పశువులు మరణిస్తే సున్నపు గోతిలో పూడ్చివేయాలి. వ్యాధి బారిన పశువుల పాలను దూడలకు తాగించొద్దు. అలాగే, పశువుల గిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి ఈగలు వాలకుండా వేపనూనె పూయాలి. నోటిలో పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. గడ్డిమేయని వాటికి ఉప్పు, బెల్లం, గ్లూకోజు కలిపిన గంజిని తాగించాలి. లేదంటే లీటర్ చొప్పున రోజుకు రెండుసార్లు అంబలి తాగించాలి.

సింగరేణి కార్మికుడికి తీవ్రగాయాలు

సాంకేతిక లోపంతో కేసీహెచ్‌పీలో ఘటన

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కేసీహెచ్‌పీలో కార్మికుడికి ప్రమాదవశాత్తు తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికుల కథనం ప్రకారం.. కేసీహెచ్‌పీలో రెండో షిఫ్టులో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న ఎల్.సుబ్రహ్మణ్య నాయుడు కన్వేయర్ బెల్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పుల్కాట్(కన్వేయర్ బెల్ట్ నిలిపివేసి)పనిచేస్తున్న క్రమంలో సాంకేతిక లోపంతో ఆటోమేటిక్‌గా రన్ అయి బెల్ట్‌లో పడి ఎడమ కాలు పూర్తిగా నుజ్జునుజ్జయింది. అప్రమత్తమైన తోటి ఫిట్టర్ కార్మికుడు రాజేందర్ బాధితుడిని రక్షించాడు. అనంతరం క్షతగాత్రుడిని ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం, కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేశారు. కాగా బాధితుడిని మణుగూరు ఏరియా ఆస్పత్రిలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, బ్రాంచి ఉపాధ్యక్షుడు వై.రాంగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆవుల నాగరాజునాయకులు గుంపెన శ్రీనివాసరావు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. కాగా గనులు, పని ప్రదేశాల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు వై.రాంగోపాల్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.



గాయపడ్డ కార్మికుడిని పరామర్శిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కారు, బైక్ ఢీ : ఒకరు మృతి

దుమ్ముగూడెం : కారు, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రేగుబల్లి గ్రామానికి చెందిన రాయపూడి కల్యాణ్(28) బుధవారం అర్ధరాత్రి తన ద్విచక్ర వాహనంపై అత్తగారి ఇంటి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రేగుబల్లి ప్రధాన రహదారిపై భద్రాచలం నుంచి లక్ష్మీనగరం వైపు వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భద్రాచలం ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

జగన్నాథపురంలో పట్టపగలే చోరీ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ పరిధి జగన్నాథపురం గ్రామంలో గురువారం పట్టపగలే గ్రామానికి చెందిన గుండె వెంకటరత్నం ఇంట్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. వెంకటరత్నం కూలి పనులకు వెళ్లగా, భార్య అమల అశ్వారావుపేటకు వెళ్లింది. పనులు ముగించుకుని తిరిగి సాయంత్రానికి ఇంటికి వచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ.20 వేల విలువైన బంగారు ఆభరణాలతోపాటు రూ.5 వేల నగదు అపహరించారు. కాగా ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు.

15 ఇసుక లారీలు పట్టివేత

దుమ్ముగూడెం : మండలంలోని తూరుబాక ఇసుక ర్యాంపు నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్ తరలిస్తున్న 15 ఇసుక లారీలను ఆంధ్రప్రదేశ్‌లోని ఎటపాక పోలీస్ స్టేషన్ వద్ద అక్కడి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీలకు రోడ్డు పర్మిట్ లేకపోవడంతో స్టేషన్ ఎదుట నిలిపివేసినట్లు తెలిసింది.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన పొట్టా రంగారావు కుటుంబీకులతో కలిసి గ్రామ శివారులోని పొలానికి వెళ్లారు. ఈ సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి అంటుకున్నాయి. ఇరుగుపొరుగు గమనించి మంటలను అదుపుచేసేందుకు యత్నించగా సాధ్యపడలేదు. సమాచారం అందుకున్న అశ్వారావుపేట అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న రూ.45 వేల నగదు, రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలు, సుమారు రూ.1.5 లక్షల విలువైన గృహోపకరణాలు, వంట సామగ్రి పూర్తిగా కాలిపోయాయి.

కారు అద్దాలు ధ్వంసం

పాల్వంచ: ఇంటి పక్కన పార్క్ చేసిన కారు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. పట్టణంలోని బాపూజీనగర్‌కు చెందిన గంగుల నరేందర్ రెడ్డి తన కారును బుధవారం ఇంటి పక్కనే పార్క్ చేశారు. కాగా రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులు కారు వెనుక భాగం ధ్వంసం చేశారు.

సహాయ సేవక్ అవార్డుల ప్రదానం

చర్ల: మండలంలో 2022వ సంవత్సరంలో వచ్చిన గోదావరి వరదల సందర్భంలో బాధితులకు సేవలందించిన వారికి చింతకుంట రైతు క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టర్ ప్రియాంక ఆల చేతుల మీదుగా గోదావరి వరద బాధితుల సహాయ సేవక్ అవార్డులను అందజేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని పలువురు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులు, జర్నలిస్టులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో చింతకుంట రైతుక్లబ్ చైర్మన్ కొత్తపల్లి రామాంజనేయులు, మేమున్నాం సహాయక కమిటీ చైర్మన్ నీలి ప్రకాశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు షేక్ షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సేవకులు

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి

డీఎస్పీ చంద్రభాను

గుండాల: సైబర్ నేరాలబారిన పడకుండా ఏజెన్సీలో అవగాహన కల్పించాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను సూచించారు. గురువారం ఆయన ఏజెన్సీ పోలీస్ స్టేషను స్టేషన్లను సందర్శించారు. పోలీసు అధికారులతో మాట్లాడి ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నిషేధిత మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి తగినచర్యలు తీసుకోవాలని కోరారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ బోర్డర్ గ్రామాలైన దామరతోగు, వీరాపూర్ గ్రామాలను సందర్శించారు. పోలింగ్ స్టేషన్ సందర్శించి, ఎలక్షన్ సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆయన వెంట గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

గిరిజనులు ఆర్థికంగా ఎదగాలి

భద్రాచలం: గిరిజనులు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదగాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచంలోని ఐటీడీఏ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో గిరిజన భవనం, సమ్మక్క–సారక్క ఫంక్షన్ హాళ్లను అద్దె ప్రాతిపదికన ఏడాది కాలానికి కేటాయించేందుకు టెండర్లు ఖరారు చేశారు. గిరిజన భవనానికి ప్రభుత్వ పాట రూ.4 లక్షలకు ప్రతిపాదించగా దుమ్ముగూడేనికి చెందిన శరత్ బాబు రూ.4.37లక్షలకు, సమ్మక్క–సారక్క ఫంక్షన్ హాల్ ప్రభుత్వ ధర రూ.2.70 లక్షలు కాగా భద్రాచలానికి చెందిన సాయిబాబు దొర రూ.3.34లక్షలకు దక్కించుకున్నారు. అనంతరం ఏపీఓ మాట్లాడుతూ ఐటీడీఏ కార్యక్రమాలు ఉంటే మొదటి ప్రాధాన్యత ఉంటుందని, లేదంటే గిరిజనులకు ప్రాముఖ్యత ఇస్తూ అద్దెకు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, అధికారులు రమణయ్య, నరసింహారావు, మునీర్‌పాషా, ఆదినారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నారుల చేత లక్కీ డ్రా తీయిస్తున్న డీడీ మణెమ్మ

హెచ్‌పీఎస్‌కు ఎంపిక

హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ప్రవేశాలు కల్పించేందుకు బాలబాలికలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ తెలిపారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో డీడీ ఆధ్వర్యాన డ్రా నిర్వహించగా ఆమె వివరాలు వెల్లడించారు. ఎంపికైన బాలబాలికలు సర్టిఫికెట్లు, ధృవపత్రాలు సమర్పించకపోతే వెయిటింగ్‌లో ఉన్న వారికి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఎంఈఓ సమ్మయ్య, సీఎంఓ రమణయ్యతో పాటు సుభద్ర, వీరమ్మ, రామారావు పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు

అదనపు డీఆర్‌డీఓ రవి

చుంచుపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి హెచ్చరించారు. గురువారం చుంచుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా 18 గ్రామ పంచాయతీల్లో గతేడాది చేపట్టిన పనులపై చర్చించారు. పలు పంచాయతీల్లో కూలీల మస్టర్ల విషయంలో అనేక కొట్టివేతలు, రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండటంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని చోట్ల మస్టర్లు నమోదు కాకుండానే నగదు చెల్లింపులు జరగ్గా, నష్టాన్ని అంచనా వేసి పెనాల్టీలను రూపొందించారు. అనంతరం అదనపు డీఆర్‌డీఓ ఎస్.రవి మాట్లాడుతూ ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఎంపీపీ బాదావత్ శాంతి, అంబుడ్స్ మన్ ప్రకాష్, విజిలెన్స్ అధికారులు అనూష, రమణారావు, అనిల్, ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, ఏపీఓ రఘుపతి, ఈజీఎస్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న అదనపు డీఆర్‌డీఓ రవి తదితరులు

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు ఇన్సూరెన్స్ స్కీమ్ అమలు

- ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున
- బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద సభ్యులకు క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ వర్తింపు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 64.35 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు (గ్రామీణ, పట్టణ) ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాదవశాత్తూ ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు మరణించిన పక్షంలో ఈ ప్రమాద బీమా వర్తించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ ఇన్సూరెన్స్ స్కీమ్ గురువారం నుంచే అమల్లోకి రానున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఈ పథకాన్ని పేరొందిన ఇన్సురెన్స్ సంస్థ ద్వారా (తక్కువ ప్రీమియం ఉండేలా) అమలు చేయాల్సిందిగా స్త్రీనిధి ఎండీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

లోన్ బీమా కూడా వర్తింపు

అదేవిధంగా బ్యాంక్ లింకేజీ ప్రోగ్రాం కింద 64.35 లక్షల ఎస్‌హెచ్‌జీ సభ్యులకు (గ్రామీణ, పట్టణ) క్రెడిట్ లింక్డ్ రిస్క్ కవరేజీ (లోన్ బీమా)ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. రుణాలు తీసుకున్న సభ్యుల్లో ఎవరైనా చనిపోతే గరిష్టంగా రూ.2 లక్షల వరకు రిస్క్ కవరేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ పథకం కూడా గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్టు ప్రకటించారు. ఈ మేరకు పీఆర్ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా విడిగా ఉత్తర్వులు జారీచేశారు.

కొత్త బాసు రాకముందే

ఖాళీ చేయాలని..!

ట్యాపింగ్ ఆధారాలను ధ్వంసం చేసే కుట్ర చేసిన ఎస్ఐబీ ఓఎస్డీ ప్రభాకర్‌రావు

- ఎన్నికల ఫలితాలు రావడంతో డిసెంబర్ 4న రాజీనామా
- అదే రోజు రాత్రి ప్రణీత్‌రావును ఎస్ఐబీకి పంపిన వైనం
- ట్యాపింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- త్వరలో ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం... ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ) హోదాలో అప్పటివరకు స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరోకు (ఎస్ఐబీ) నేతృత్వం వహించిన టి.ప్రభాకర్‌రావు రాజీనామా చేయడం ... త్వరలో ఆ విభాగానికి మరో బాస్ వచ్చే అవకాశం ఉండటం... ఈ పరిణామాల నేపథ్యంలోనే గత డిసెంబర్ 4న రాత్రే ఎస్ఐబీ ఆఫీస్‌లోని 'వార్ రూమ్'ను మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ప్రణీత్‌ను బుధవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన పంజగుట్ట పోలీసులు తదుపరి విచారణ కోసం కస్టడీకి కోరుతూ గురువారం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను వెనక్కు ఇచ్చిన న్యాయస్థానం అదనపు పత్రాలతో శుక్రవారం మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది.

డీఎస్పీగా చేరి ఓఎస్డీగా రాజీనామా...

1991లో డీఎస్పీగా పోలీసు విభాగంలో అడుగుపెట్టిన టి.ప్రభాకర్‌రావు 2001లో ఐపీఎస్ హోదా పొంది ఐజీగా పనిచేస్తూ 2020 జూన్‌లో పదవీ విరమణ పొందారు. అదే ఏడాది నవంబర్ 3న ప్రభాకర్‌రావును ఓఎస్డీ హోదాలో ఎస్ఐబీలో నియమించారు. అప్పట్లో నిఘా విభాగానికి నేతృత్వం వహించిన నవీన్ చంద్ పదవీ విరమణ చేయడంతో తాత్కాలికంగా ఆ బాధ్యతల్నీ ప్రభాకర్‌రావుకే అప్పగించారు. అప్పటి నుంచే ఈ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలకు బీజం పడిందని అనుమానిస్తున్నారు. నిఘా విభాగానికి అనిల్ కుమార్‌ను బాస్‌గా నియమించిన అప్పటి ప్రభుత్వం ప్రభాకర్‌రావును ఎస్ఐబీకి పరిమితం చేసింది. అప్పటి నుంచి ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతూ వచ్చిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న రాజీనామా చేశారు.

ఒకట్రెండు రోజుల్లో ఎస్ఐబీకి మరో అధికారిని నియమించే అవకాశం ఉండటంతో తమకు ఇబ్బంది లేకుండా, తక్షణం ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు చెరిపేయాలని ప్రణీత్ రావుకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో వార్ రూమ్‌లు ఖాళీ చేసి, ట్యాపింగ్ ఆధారాలు ధ్వంసం చేయడానికి ఇతడు సిద్ధమైనట్లు పోలీసులు చెప్తున్నారు.

హార్డ్‌డిస్క్‌ల్ని కట్టర్లతో కట్ చేశారు

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్ ఓ ఎలక్ట్రీషియన్‌తో కలిసి ఎస్ఐబీ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ వార్ రూమ్‌తోపాటు అధికారిక ట్యాపింగ్స్ జరిగే లాగర్ రూమ్ దగ్గర సీసీ కెమెరాలను ఆఫ్ చేయించాడు. 17 కంప్యూటర్లలో ఉన్న వాటితోపాటు విడిగా భద్రపరిచిన 50 హార్డ్‌డిస్క్‌ల్నీ ధ్వంసం చేయడానికి ఉపక్రమించాడు. ఎలక్ట్రీషియన్ తోపాటు నమ్మినబంటుగా ఉన్న ఓ పోలీసు సహాయంతో ఎలక్ట్రిక్ కట్టర్ వినియోగించి ఈ హార్డ్‌డిస్క్‌లు ధ్వంసం చేశాడు. ఎస్ఐబీ అనునిత్యం మావోయిస్టులకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ, వారిపై నిఘా ఉంచుతుంది. ఈ నేపథ్యంలోనే మావోయిస్టుల తోపాటు వారి సానుభూతిపరులు, వారితో వివి ధ రకాలైన సంబంధాలు కలిగిన వారి వివరా లను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ నిక్షిప్తం చేస్తుంటుంది. ఎస్ఐబీ దృష్టిలో ఇది అత్యంత విలువైన డేటా. ప్రణీత్ ధ్వంసం చేసిన హార్డ్‌డిస్క్‌ల్లో ఈ డేటా ఉందని, ఇప్పుడు దాన్ని తిరిగి పొందటం సాధ్యం కాదని అధికారులు చెప్తున్నారు. ఆ కోణంలోనూ ప్రణీత్‌ను విచారించనున్నారు. ప్రణీత్‌ను పోలీసు కస్టడీలోకి తీసుకుని విచారించిన తర్వాత ప్రభాకర్‌రావు సహా మరికొందరికి నోటీసులు జారీ చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

రైతులు, నిరుద్యోగుల

ఆస్తులు తాకట్టు పెట్టుకోవద్దు

- బ్యాంకర్లకు డిప్యూటీ సీఎం భట్టి సూచన
- రైతుల విషయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించండి
- ఎస్‌హెచ్‌జీల మహిళలకు ఎక్కువ రుణాలివ్వండి
- మంత్రి తుమ్మలతో కలిసి ఎస్ఎల్‌బీసీ భేటీకి హాజరు



సాక్షి, హైదరాబాద్: రైతులు, నిరుద్యోగులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు వారి ఆస్తులను తాకట్టు పెట్టుకోవడం సరైంది కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతుల విషయంలో బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకర్లు వారికి ఎక్కువ రుణాలు ఇవ్వాలని కోరారు. స్వయం ఉపాధి కోసం యువతకు కూడా రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గురువారం బేగంపేటలోని ఒక ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) 40వ త్రైమాసిక సమావేశానికి వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకర్లను ఉద్దేశించి మాట్లాడారు.

రుణ వితరణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి

రుణాలు ఇవ్వడం సామాజిక బాధ్యతగా బ్యాంకర్లు గుర్తించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వడం వల్ల సంపదను ప్రజలకు పంచవచ్చని వివరించారు. రైతులకు రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసహనం ప్రదర్శిస్తే వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రుణ భారం తీరక ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గత పాలనలో లావాదేవీలు జరగని ఖాతాలకు సంబంధించిన రైతులకు మళ్లీ రుణాలు ఇవ్వాలని చెప్పారు. రానున్న ఐదేళ్లలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ రహిత రుణాలు అందించాలని భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. వ్యాపారంలో విఫలమైన ఈము రైతులకు రుణాల చెల్లింపుల విషయంలో వన్ టైం సెటిల్మెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తాను ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విద్య రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ప్రారంభం అయ్యాయని, 20 ఏళ్లు అవుతున్నా ఆ రుణాల జారీలో ప్రగతి కనిపించడం లేదని అన్నారు.

ప్రభుత్వ పథకాలకు సహకరించండి: తుమ్మల

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల్లో ప్రజా ప్రాధాన్యత ఉన్న వాటిని గుర్తించి వాటిని ముందుకు తీసుకెళ్లడానికి బ్యాంకర్లు సహకరించాలని మంత్రి తుమ్మల కోరారు. రుణాలు ఇచ్చే విషయంలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పాడి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా పట్టు గూళ్ల పెంపకం రైతులకు రూ.1.83 కోట్ల ప్రోత్సాహక చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ మిత్ర, నాబార్డ్ జీఎం పీపీ ఉషా తదితరులు పాల్గొన్నారు.

రూ. 49,501 కోట్ల పంట రుణాలు: ఎస్ఎల్‌బీసీ

రాష్ట్రంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.49,501 కోట్ల పంట రుణాలు ఇచ్చినట్లు ఎస్ఎల్‌బీసీ వెల్లడించింది. లక్ష్యంలో 67.41 శాతం చేరుకున్నట్లు గురువారం విడుదల చేసిన నివేదికలో తెలిపింది. రూ.624 కోట్ల మేర విద్యా రుణాలు, రూ.2,890 కోట్ల గృహ రుణాలు ఇచ్చినట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.7,55,800 కోట్లకు చేరాయని వివరించింది.

సింగరేణిలో సేఫ్టీ 'నోమ్'

- భూగర్భ గనుల్లో ప్రమాదాల నివారణకు ఆస్ట్రేలియా టెక్నాలజీ వినియోగం
- ప్రయోగాత్మకంగా ఒక గనిలో అమలుకు అంగీకారం
- వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా మార్చేందుకు 'సింగరేణి' అంతర్జాతీయస్థాయి ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ తెలిపారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడానికి ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం సంస్థ ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. భూగర్భగనుల్లో రక్షణ చర్యలెన్ని తీసుకుంటున్నా, అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతి చెందిన ఘటనలు గతంలో అనేకం జరిగాయని ఈ సమావేశంలో అధికారులు అభిప్రాయపడ్డారు.



ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ సంస్థ రూపొందించిన యంత్రం పనితీరును తెలుసుకుంటున్న సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నోమ్ సంస్థ రూపొందించిన పరికరం గనిలో పైకప్పు ప్రమాదం జరగకముందే ఫ్లాష్ లైటింగ్, సైరన్‌ల ద్వారా అక్కడ పనిచేస్తున్న కార్మికులు, అధికారులను హెచ్చరించి అప్రమత్తం చేస్తుందని, దీంతో ప్రమాదం నివారించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకొని, ప్రాణనష్టం జరగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏదైనా ఒక భూగర్భగనిలో వినియోగిస్తామని, అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని సీఎండీ వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (ఆర్‌అండ్‌డీ) సుభాని తదితరులు పాల్గొన్నారు. కాగా నోమ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నాథన్‌టవెన్, జనరల్ మేనేజర్ కేసన్‌ఫిన్‌లెన్ డెమోన్‌స్ట్రేషన్ ద్వారా యంత్రం పనితీరు గురించి అధికారులకు వివరించారు.

ఆ విలేకరులను క్షమించేది లేదు – టీయూడబ్ల్యూజే, ఐజేయూ

సాక్షి, హైదరాబాద్: గొలుసు కట్టు మనీ స్కీమ్‌కు ఒక కుటుంబం బలైన దుర్ఘటనలో కొంతమంది విలేకరుల పాత్ర ఉండటం అత్యంత విచారకరమని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే), ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) పేర్కొన్నాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని టంగుటూరు గ్రామంలో జరిగిన ఘటన మీడియాలోని ప్రతి ఒక్కరూ తలదించుకునేలా చేసిందని ఆ సంఘాలు విచారం వ్యక్తం చేశాయి. మీడియా ప్రమాణాలను, గౌరవాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ గురువారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశాయి. వాస్తవాలను రాయకుండా ఉండడానికి ఒక వ్యక్తి వద్ద డబ్బులు డిమాండ్ చేసిన విలేకరులు వృత్తికి ద్రోహం చేయడమే గాకుండా ఆ క్రమంలో నలుగురి ప్రాణాలు పోవడానికి కారకులయ్యారని టీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా వార్తలు

రైతాంగాన్ని విస్మరిస్తే పతనం తప్పదు

సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన కేంద్రం దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రైతాంగాన్ని విస్మరించిన వారికి పతనం తప్పదని గతంలో పలుమార్లు రుజువైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు తెలిపారు. కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం జేబుసంస్థగా మారి అన్నదాతలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన గురువారం ఖమ్మం పాతబస్టాండ్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ ను దహనం చేశారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ మూడేళ్లుగా మద్దతు ధర కోసం రైతులు పోరాడుతుంటే పట్టించుకోకపోగా, తూటాలు గురిపెడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసేలా నూతన సాగు చట్టాలను తీసుకురాగా, ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, సీపీఐ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పోటు ప్రసాద్, దొండపాటి రమేష్, అడసా రామకోటయ్య, మిడికంటి వెంకటరెడ్డి, రాంబాబు, మాదినేని రమేష్, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, జమ్ముల జితేందర్‌రెడ్డి, శింగు నర్సింహారావు, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సీహెచ్.సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, రావి శివరామకృష్ణ పాల్గొన్నారు.

చర్లపల్లిలో హాల్టింగ్

ఖమ్మం మామిళ్లగూడెం: కొన్నాళ్లుగా ప్రయాణికుల నుంచి వస్తున్న వినతుల మేరకు పలు సూపర్‌ఫాస్ట్ రైళ్లకు చర్లపల్లిలో హాల్టింగ్ ఇచ్చారు. ఈ విషయాన్ని ఖమ్మం సీపీఐ ఎం.డీ. జాఫర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ–సికింద్రాబాద్(12713), సికింద్రాబాద్– విజయవాడ(12714) శాతవాహన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు సికింద్రాబాద్–గుంటూరు (12706), గుంటూరు–సికింద్రాబాద్ (12705) ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు గురువారం నుంచి చర్లపల్లిలో ఆగుతాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వెంటాడుతున్న కష్టాలు

మామిడి రైతులకు వరుస నష్టాలు

- కొన్నేళ్లుగా అనుకూలించని వాతావరణం
- ఈ ఏడాది కూడా అదే పరిస్థితి
- చిగురుగా మారిన పూత.. కనిపించని కాత
- ఉమ్మడి జిల్లాలో 53వేల ఎకరాల్లో మామిడి తోటలు

ఇల్లెందురూరల్: ఈ ఏడాది కూడా మామిడి రైతులకు కాలం కలసిరాలేదు. ఖరీఫ్ చివరలో కురిసిన వర్షాలకు తోడు నిషాన్ తుఫాన్ ప్రభావం.. వాతావరణంలో వచ్చిన మార్పులు రైతులకు శాపంగా మారాయి. ఈ అంశాలన్నీ మామిడి పూత, పిందెలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా మునుపెన్నడూ లేనంతగా ఈసారి మామిడి దిగుబడి తగ్గుముఖం పట్టే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

2020 నుంచి అదే పరిస్థితి..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మామిడి తోటలు సుమారు 53వేల ఎకరాల్లో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 11వేల ఎకరాల్లో, ఖమ్మం జిల్లాలో 42వేల ఎకరాల్లో ఈ తోటలు సాగవుతున్నట్లు అధికారిక అంచనా. భద్రాద్రి జిల్లాలో అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, అశ్వారావుపేట మండలాల్లో, ఖమ్మం జిల్లాలో ఎర్రుపాలెం, తల్లాడ, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు, కామేపల్లి, సత్తుపల్లి మండలాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అయితే, వరుసగా ఐదేళ్ల నుంచి మామిడి రైతులకు నష్టాలే



రొంపేడులోని మామిడి తోటలో కనిపించని పూత



పూత స్థానంలో కనిపిస్తున్న లేత ఆకులు

ఎదురవుతున్నాయి. 2020లో భారీ వర్షాల కారణంగా పూత, పిందె పూర్తిగా రాలిపోయాయి. 2021, 22 సంవత్సరాల్లో కరోనా ప్రభావంతో విక్రయాలు లేక ధరపై ప్రభావం చూపింది. ఫలితంగా కాత కాస్త ఆశాజనకంగా ఉన్నా ధర లేక రైతులు నష్టాలను మూటగట్టుకున్నారు. ఇక గతేడాది పూత, కాత సంతృప్తిగా ఉండడంతో దిగుబడిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు నల్లి రూపంలో నష్టం ఎదురైంది. ప్రస్తుతం చిక్కగా వచ్చిన పూత వాతావరణం అనుకూలించక చివరకు చిగురుగా మారింది.

దీంతో దిగుబడి ప్రారంభంలోనే రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

ప్రతికూల వాతావరణమే..

గతేడాది కాత దశలో నల్లి సోకినా దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో ఈసారి కూడా అదే స్థాయిలో దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. కానీ పూత దశలోనే వారి ఆశలు అడియాసలయ్యాయి. గతేడాది చివరలో కురిసిన వర్షాలకు తోడు నిషాన్ తుఫాన్ మామిడి తోటలపై ప్రభావం చూపాయి. పూతకు కీలకమైన సమయాల్లో చోటుచేసుకున్న పరిణామాలు, చీడపీడల ప్రభావం మామిడి రైతుకు శాపంగా మారాయి. ఈ కారణంగా ప్రస్తుతం పూసిన పూత చిగురుగా మారడంతో ఎక్కువ చోట్ల కాత కనిపించకుండా పోయింది. ప్రధానంగా ముదురు తోటల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు.

ప్రయత్నాలన్నీ వృథా



గతేడాది డిసెంబర్ నుంచి పూత మొదలు కాగా, జనవరిలో పూతతో చూసి కాత ఆశాజనకంగా ఉంటుందని అనుకున్నాం. కానీ పూత క్రమంగా చిగురుగా మారగా, కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి.

– మంచె కృష్ణయ్య, కొమరారం, ఇల్లెందు మండలం

కౌలు రైతుల గగ్గోలు

మామిడి రైతులు అత్యధికంగా పూత దశలోనే తోటలను వ్యాపారులకు కౌలు ఇవ్వడం ఆనవాయితీ. పూత దశలో తోటలను పరిశీలించి కౌలు ధర నిర్ణయిస్తారు. ఇందులో ముందుగా కొంత.. పంట చేతికందాక మిగతా సొమ్ము చెల్లిస్తారు. ఇదే తరహాలో ఈసారి కూడా కౌలు రైతులు మామిడి తోటలు తీసుకున్నారు. గతేడాది నల్లి మినహా మామిడి దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో ఈసారి కౌలు రైతులు ఆసక్తి కనబరిచారు. కానీ తోటల్లో కాత నామమాత్రంగా కూడా కనిపించకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

మామిడి కలసి రావడం లేదు..



గడిచిన ఐదేళ్లుగా మామిడి పంట కలిసి రావడం లేదు. అతివృష్టి, అనావృష్టి, చీడపీడలు ఏదో ఓ రూపంలో నష్టాలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది పూత బాగానే ఉన్నా తుఫాన్, చలి ప్రభావంతో చిక్కని పూత చిగురుగా మారింది.

–తోకల జానయ్య, కొమరారం, ఇల్లెందు మండలం

నేటి నుంచి మళ్లీ తునికాకు టెండర్లు

- మూడు సార్లు పిలిచినా కొన్ని యూనిట్లే అమ్మకం
- మూడు జిల్లాల్లో ఇంకా 26 యూనిట్లు



సేకరణకు సిద్ధం ఉన్న తునికాకు

పాల్వంచరూరల్: ఈ ఏడాది తునికాకు సేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. ఇప్పటివరకు మూడు సార్లు ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించినా ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని మొత్తం యూనిట్లు అమ్ముడవలేదు. దీంతో నాలుగో దఫా నేటి నుంచి 19వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడు జిల్లాల పరిధిలో ఈ ఏడాది 35,100 స్టాండర్డ్ బ్యాగ్‌ల తునికాకు సేకరించాలనేది అధికారుల లక్ష్యం. అయితే, మూడు దఫాలుగా ఆన్‌లైన్‌లో టెండర్లు నిర్వహించినా ఫలితం లేకపోవడంతో నాలుగో దఫా టెండర్లకు సిద్ధమయ్యారు. కాగా, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 10 డివిజన్ల పరిధిలో 51యూనిట్లు ఉండగా 25యూనిట్లలో తునికాకు సేకరణను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. భద్రాచలం డివిజన్‌లోని ఐదు యూనిట్లలో మూడు, మణుగూరు డివిజన్‌లోని ఐదింటికి రెండు, పాల్వంచ డివిజన్‌లో నాలుగుకు రెండు, వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలోని ఐదు యూనిట్లలో మూడు, కొత్తగూడెం డివిజన్ పరిధిలోని నాలుగు యూనిట్లలో ఒకటి, ఇల్లెందు డివిజన్ పరిధిలోని ఎనిమిది యూనిట్లలో ఆరు యూనిట్లను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఇక ఖమ్మం జిల్లాలోని ఖమ్మం డివిజన్‌లో రెండు, సత్తుపల్లి డివిజన్‌లో మూడింటికి ఒక్క యూనిట్ కూడా అమ్ముడుపోకపోవడం గమనార్హం. అలాగే, మహబూబాబాద్ జిల్లాలోని మహబూబాబాద్ డివిజన్‌లో ఐదు యూనిట్లకు ఒకటి, గూడూరు డివిజన్‌లో పదింటికి ఏడు యూనిట్లను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. ఈమేరకు మిగిలిన 26 యూనిట్లను అప్పగించేందుకు నాలుగో దఫా టెండర్ల ఆహ్వానించగా ఏ మేరకు ఫలితం వస్తుందో వేచి చూడాల్సిందే.

చెక్కల ఇల్లు వచ్చేసింది !

- 50 గజాల స్థలంలో ఏర్పాటు
- రూ.6.50 లక్షల వ్యయంతో నిర్మాణం



చెక్క ఇంటిని పరిశీలిస్తున్న స్థానికులు (ఇన్‌సెట్) ఇంటి లోపల భాగం

పునాది తీసేది లేదు.. సిమెంట్, రాళ్లు, ఇసుక కలిపేది లేదు. పైగా అతి కొద్ది స్థలంలోనే ఇంటిని తీసుకొచ్చి పెడుతున్నారు. ఇలా నేలకొండపల్లిలోని ఓ వెంచర్‌లో చెక్కల ఇల్లు ఏర్పాటు చేయగా ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. హైదరాబాద్‌లో చెక్కలతో నిర్మించిన ఈ ఇంటిని ఇక్కడికి తీసుకొచ్చి 50 గజాల స్థలంలో ఏర్పాటు చేశారు. బెడ్‌రూమ్, సిట్ రూమ్, హాల్, అటాచ్డ్ బాత్‌రూమ్ గల ఈ ఇంటికి రూ.6.50 లక్షల వ్యయం అయిందని వెంచర్ నిర్వాహకులు రంగిశెట్టి వెంకటప్పయ్య, రావెళ్ల కృష్ణారావు, మేనేజర్ సురేష్‌నాయుడు తెలిపారు. ఈ ఇంటిని తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివస్తున్నారు. – నేలకొండపల్లి

రైతుల రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

మధిర: ఎన్నికల సమయాన ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మధిరలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రమాణ స్వీకారం రోజునే రైతులకు రూ.2 లక్షల వ్యవసాయ రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించకపోవడం రైతాంగాన్ని మోసం చేయడమేనని తెలిపారు. అధికారంలోకి రావడానికి అనేక సంక్షేమ పథకాలను ప్రకటించి ఇప్పుడు విస్మరిస్తున్నారని విమర్శించారు. ఇకనైనా రుణాలు మాఫీ చేయడంతోపాటు అర్హులందరికీ రైతుబంధు నగదు జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ మధిర నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు చిలివేరు సాంబశివరావు, పాపట్ల రమేష్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, ఉపేంద్ర, కృష్ణారావు, నాగభూషణం, రామకృష్ణ, రవీందర్, రమేష్, ప్రణీత్ పాల్గొన్నారు.